

11న ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ, సభ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని 11న నగరంలో భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి టి.తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, ఐద్వా, యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న గోకవరం బస్టాండ్ దగ్గరలోని అంబేద్కర్ విగ్రహం నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రదర్శన (భారీ ర్యాలీ) ప్రారంభం కానుందని పేర్కొన్నారు. అనంతరం కంబాల చెరువు, హైటెక్ బస్టాండ్ పార్కు వెనుక బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు

- బిల్లులు రాక అయోమయం
- పనుల్లోనూ ఎంఎల్ఎల జోక్యం
- సొంత ఖర్చులతో సతమతం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గ్రామ ప్రథమ పౌరులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బకాయిలపై ప్రశ్నిస్తే ఎక్కడ ఇబ్బందులు పెడతారనే భయంతో ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ప్రజలకు ఏ కష్టమొచ్చినా, నష్ట మొచ్చినా సర్పంచ్ తలుపే తడతారు.. ఊళ్లో ఏ పనీ జరగాలన్నా సర్పంచ్‌ల ద్వారానే నడుస్తాయి. మొత్తానికి ఆ ఊరికి సర్పంచే సర్వస్వం. కానీ మారిన పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఇప్పుడా పదవి ముళ్ల కుర్చీలా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, గ్రామాల్లోనూ ఎంఎల్ఎల ఆదిపత్యంతో సర్పంచ్ కుర్చీకి విలువ తగ్గుతోంది. రూ.లక్షలు ఖర్చు చేసి ఎన్నికల్లో గెలుపొందితే ఆశించిన మేర పనులు సాగక వారు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.

ఆర్థిక సంఘం నిధులూ పక్కదారి

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులూ పక్కదారి పడుతున్నాయి. ఈ నిధులు ఏ పనులకు ఎంత శాతం వెచ్చించాలనే ఖచ్చితమైన నిబంధనలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వమే ఉల్లంఘిస్తోంది. రెండేళ్లుగా విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఆదేశిస్తోంది. జిల్లాలో 300 పంచాయతీలున్నాయి. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ సర్పంచ్‌లు అనే తేడాలేకుండా అందరికీ ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో బిల్లులు పెట్టగానే ఆరు నెలల లోపే మంజూరు కాగా.. ఇప్పుడు సంవత్సరాలు గడుస్తున్నా రావడం లేదని సర్పంచ్‌లు చెబుతున్నారు. చాగల్లులో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఒక సర్పంచ్‌కు రూ.రెండు లక్షల బకాయిలు నిలిచిపోయాయి. సీతానగరం మండలంలో మరొక పంచాయతీకి రూ.లక్షల్లో బిల్లులు రావాల్సి ఉంది. సర్పంచ్ బ్యాంకులకు తిరిగి చెల్లించలేకపోవటంతో సదరు బ్యాంకు యాజమాన్యం ఆస్తులను సైతం జప్తు చేసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ప్రతి మండలంలోనూ నెలకొంది. అత్యధిక మంది సర్పంచ్‌లు బిల్లులు రాకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల్లోనూ ఎంఎల్ఎలదే పై చేయి

గ్రామాల్లోనూ ఎంఎల్ఎలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. సర్పంచ్‌లు సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు చేస్తే ఎంఎల్ఎలు ప్రారంభోత్సం పేరుతో హడావుడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సర్పంచ్‌లుగా అధికారం చేపట్టి గత నెలతో రెండు సంవత్సరాలు పూర్తయింది. అధికార పార్టీ ఒత్తిడితో కొందరు రూ.లక్షలు వెచ్చిస్తే, మరి కొందరు రూ.కోట్లు వెచ్చించారనేది బహిరంగ రహస్యం. ఆ ఖర్చులకు తోడా తాజాగా ఆర్థిక ఇబ్బందులు గోరుచుట్టుపై రోకలిపోటులా మారాయి. ప్రభుత్వ తీరుపై వ్యతిరేక స్వరం వ్యక్తమవుతోంది. పారిశుద్ధ్య కార్మికులకు సైతం వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారు సొంతంగా ఖర్చు చేసి కొన్ని పనులు చేయించారు. గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గతంలో వేసిన లైట్లు సైతం కొన్ని చోట్ల వెలగడం లేదు. ప్రజలు సర్పంచ్‌లను నిలదీస్తుండడంతో వారు సొంత ఖర్చులతో రిపేర్లు చేయిస్తున్నారు. తాగునీటి పైపులైన్ల మరమ్మతుల ఖర్చులను సైతం తామే భరిస్తున్నామని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో రూ.లక్షల్లో ఖర్చు చేశామని, ఇప్పుడు అప్పులు తెచ్చి పనులు చేయించడం తలకు మించిన భారంగా మారుతోందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

బకాయిల చెల్లింపునకు చర్యలు

గ్రామ పంచాయతీలలో పనులకు సంబంధించిన బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాము. పంచాయితీ సెక్రటరీలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాము. కొన్ని పంచాయతీలలో బకాయిలు సంబంధించి కోర్టు కేసులు ఉన్నాయి. కోర్టు ఆదేశాల ప్రకారం అక్కడ చెల్లింపులు జరుగుతున్నాయి.

- జగదాంబ, జిల్లా పంచాయతీ అధికారి, తూర్పుగోదావరి జిల్లా.

ధర్నాలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు

ఉద్యోగులను మోసగించిన వైసిపి

సిపిఎం, సిపిఐ ధర్నాలో అరుణ్, మధు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపికి పాలించే అర్హత ఎక్కడదని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, తాటిపాక మధు ప్రశ్నించారు. గురువారం రాజమండ్రి గోకవరం బస్ స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై ధర్నా నిర్వహించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిఎ బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని జగన్ హామీ ఇచ్చారని, ఇప్పుడు మాట తప్పి ఇప్పుడు జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. ఒక్కసారి కూడా డిఎస్‌సి పెట్టలేదని, 1998 బ్యాచ్ సమస్య కూడా పరిష్కారం కాలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా, మభ్యపెట్టి, మైమరపించి మోసం చేస్తున్నారని అన్నారు. మాట తప్పం, మడమ తిప్పం అని చెప్పి మాట తప్పారని, మడమ తిప్పారని విమర్శించారు. రకరకాల యాప్‌ల పేరుతో టీచర్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారని, దీనివల్ల వారు ఒత్తిడికి లోనై చనిపోతున్నారని తెలిపారు. బాపట్ల జిల్లాలో జరిగిన తాజా ఘటన ప్రస్తావించారు. కరోనా కాలంలోనూ 35 మంది టీచర్లు ప్రాణాలు వదిలారని తెలిపారు. ఈ కాలంలో ఒత్తిడికి లోనై ఐదుగురు టీచర్లు బలయ్యారని చెప్పారు. బైజూస్‌కు సేవ చేయకపోతే విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రంగంలోకి దిగుతారని, ఉపాధ్యాయులను నోటీసుల రూపంలో వేధిస్తూ, హింసిస్తున్నారని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్ డబ్బు రూ.3 వేల కోట్లను వాడుకునేందుకూ ఉద్యోగులకు అవకాశం లేకుండా చేశారని, ప్రభుత్వమే దోచుకుందని విమర్శించారు. జీతాలూ సకాలంలో ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రైవేటు స్కూల్ టీచర్లకైతే అసలు భద్రతే లేదని పేర్కొన్నారు. ప్రైవేటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ చట్టం తేవాలని కోరారు. చిన్న స్కూళ్లపై వేధింపులు ఆపాలని డిమాండు చేశారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి నేరుగా జోక్యం చేసుకుని గెలవాలని కిందిస్థాయి ప్రజాప్రతినిధులకు సిఎం స్థాయిలో ఆదేశాలు జారీ చేయడం దాని కోసం అడ్డదారులు తొక్కడం సిగ్గుచేటన్నారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధాన్ని, అణచివేతను ఉపయోగిస్తూ అరెస్టులు, షోకాజ్ నోటీసులతో నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని విడనాడి సిపిఎస్ రద్దుతో సహా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, సుందర బాబు, నాయకులు ఎస్ఎస్.మూర్తి, టిఎస్.ప్రకాష్, పోలిన వెంకటేశ్వరరావు, టి.సావిత్రి, పడాల రామకష్ణ, పూర్ణిమరాజ్, అప్పలనరసయ్య, వెంకటలక్ష్మి, సిపిఐ నగర కార్యదర్శి కొండలరావు, కె.జోజిరాజు, చప్పా రమణ, ఎంఎస్.రాజు, కె.రామకష్ణ, సునీల్, నల్లా రామారావు, యడ్ల లక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో బ్రైడల్ స్టోర్ 'ఫ్లష్'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

దేశంలోనే ప్రథమ బ్రైడల్ స్టోర్ 'ఫ్లష్' వెడ్డింగ్ సూపర్ మార్కెట్ రాజమహేంద్రవరంలో అందుబాటులోకి వచ్చింది. జెఎన్ రోడ్‌లో కిఫ్ భవనంలో గురువారం స్టోర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్, మోనా మార్గాని, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, ప్రముఖ యాంకర్, నటి సుమ కనకాల, నటి సంగీత, సెలబ్రిటీలు రచిత, నీలిమలు స్టోర్‌ను, వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెలబ్రిటీలు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, శ్రీ దేవి సన్స్ రమేష్ హేమ్ చంద్, కొత్త బాలమురళీకష్ణ, నగరానికి చెందిన పలువురు ప్రముఖ మహిళలు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ప్రముఖులు

పిల్లల్లో రక్తహీనతను నివారించాలి

ప్రజాశక్తి-నల్లజర్ల, ఉండ్రాజవరం

ఆరోగ్యవంతమైన భావితరాల కోసం నులిపురుగులను నిర్మూలించాలని పలువురు పిలుపు ఇచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖతో కూడిన నాలుగు ప్రధానశాఖల అధికారులు సమావేశమై జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం కోసం చర్చించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు మాట్లాడుతూ ఈ నెల 14న జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు చెప్పారు. నల్లజర్ల పిహెచ్‌సిలో మొత్తం 14,300 మంది పిల్లలకు ఈ కార్యక్రమంలో మాత్రలు పంపిణీ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.జోగేశ్వరరావు, టి.వెంకటలక్ష్మి, కలిదిండి వెంకట చంద్రశేఖరరాజు, పాల్గొన్నారు. డీ వార్మింగ్ టాబ్లెట్స్ పంపిణీపై ఉండ్రాజవరంలో ఎంపిడిఒ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఎంఇఒ పివిఎస్.నాగరాజు తెలిపారు.

చర్చిస్తున్న అధికారులు

మార్చి 14, 18న డివార్మింగ్ డే

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాలో మార్చి 14, 18 తేదీల్లో నిర్వహించే నులిపురుగుల నివారణ (డి వార్మింగ్ డే) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డా కె.. మాధవీలత పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నులిపురుగుల నివారణపై వైద్యాధికారులు, సిబ్బంది ప్రజల్లో, ముఖ్యంగా పిల్లలు, వారి తల్లదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. నులిపురుగు నివారణకు వైద్యాధికారులు, సిబ్బందికి ప్రజలు, పాఠశాల విద్యార్థులు సహకరించాలన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పిహెచ్‌సిలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు తణుకుకు చెందిన నిసా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ అయేషా ఖాన్, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషా దేవి పరీక్షలు నిర్వహించారు. 25 మంది గర్భిణులను పరీక్షించి, వారికి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్, డివిఎల్.కుమారి, సూపర్‌వైజర్ కె.నాగమణి, స్టాఫ్ నర్సులు కుమారి, సంధ్య, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే సత్ఫలితాలు

ప్రజాశక్తి-కడియం

అందరూ సమిష్టి కృషితో బేదాభిప్రాయాలు లేకుండా పాఠశాలలో పని చేసినపుడే మంచి ఫలితాలు సాధించగలమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్ కడియం మండలం దుళ్ల హైస్కూల్ ఉపాధ్యాయులకు క్లాస్ తీసుకున్నారు. హైస్కూల్లో తరచూ వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆయన ఉపాధ్యాయులు, మేనేజ్మెంట్ కమిటీతో సమావేశమయ్యారు. వివాదాలకు కారణాలను ఆరా తీశారు. పలు తరగతుల విద్యార్థులు తరచూ ఘర్షణ పడడం, దాడులు చేసుకోవడం, చదువులో దారుణంగా వెనుకబడడం వంటి విషయాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. దీనిపై ప్రధాన ఉపాధ్యాయిని సుధ వివరణ ఇస్తూ పాఠశాల జరుగుచున్న సమయంలో మాత్రం ఏ వివాదాలు లేవని, అనంతరం బయట వ్యక్తులతో కలిసి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ లజపతిరాయ్, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నూలు సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, గుంటూరి లక్ష్మి, కంటిపూడి సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డివైఇఒ

అధిక పురుగు మందులతో హాని

ప్రజాశక్తి-గోపాలపురం

పురుగుమందులు అధిక మోతాదులో వాడటం వల్ల పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను కోల్పోతామని పెద్దాపురం ఏరువాక వ్యవసాయం కేంద్రం శాస్త్రవేత్త నరసింహారావు అన్నారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మంచి వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాల్లో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ క్లస్టర్ పొలంబడి క్షేత్రాలను పెద్దాపురం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా వనరుల కేంద్రం డిడి ఎ.బోసుబాబు, వ్యవసాయ సంచాలకులు పి.చంద్రశేఖర్, ఎఒ రాజారావు ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వరి పొలంలో మిత్ర పురుగులు ఎక్కువగా, వాటికి హాని చేసే శత్రు పురుగులు తక్కువగా ఉన్నాయని, కావున సస్యరక్షణ చర్యలు అవసరం లేదని తెలిపారు. మిత్ర పురుగులను సంరక్షించుకోవాంటే అత్యంత విషపూరితమైన పురుగుమందులను వాడకూడదని సూచించారు. తక్కువ మోతాదులో ఉండే వేప కషాయాలను, వేప నూనెను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ బి.రాజారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నరసింహారావు

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ నెల 13న జరగనున్న రెండు స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంకె.మీనా వెలగపూడి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 242 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఓటు హక్కు వినియోగించు కోవడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇందులో భాగంగా స్థానిక సంస్థలకు చెందిన కొవ్వూరు మునిసిపాలిటీలో 23 మంది, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 28 మంది, 9 మంది జెడ్‌పిటిసిలు, 179 మంది ఎంపిటిసిలు, ముగ్గురు ఎంఎల్‌ఎలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబందించి పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు, 9 ఎంసిసి బృందాలు, 9 ఎఫ్ఎస్‌టి బృందాలను నియమించామన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఒ జి.నరసింహులు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్‌బిఐ వద్ద కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మట్ట సుబ్బారావు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద కొవ్వూరు నియోజవర్గ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎఐసిసి సభ్యుడు అమర్జహబేగ్ మహమ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఎల్ఐసి, ఎస్‌బిఐల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీకి ఎల్ఐసి, ఎస్‌బిఐలో ఉన్న రూ.వేల కోట్లు బలవంతంగా అప్పు ఇచ్చారని, ఇప్పుడు అదానీ సంస్థ పీకల్లోతులో మునిగిపోయిందన్నారు. రూ.వేల కోట్లకు ఎవరు సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే అదానీ ఆస్తులను ఇడి అటాచ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాకా పుల్లారావు, సైన్ సుబ్బారావు, జొన్నకూటి రవికుమార్, గళ్లా భాస్కరరావు, బర్రే రమణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వారం దాకా సార్‌ను కలవడం కుదరదయ్యా..
ఇవాళ ధ్యానం.. రేపు హఠయోగం..
ఎల్లుండి మౌనవ్రతం.. చివరికి యోగనిద్ర..!!

దాడులు, ఘర్షణలపై 100కు ఫోన్ చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎటువంటి దాడులు, ఘర్షణలు జరిగినా వెంటనే 100 నెంబరుకు కాల్ చేస్తే క్షణాల్లో పోలీసులు వస్తారని ఎంపీ భరత్ ప్రజలకు వివరించారు. గురువారం నగరంలోని 45వ వార్డులో లూథరగిరి చర్చి వెనకాల వాంబే కాలనీ నుంచి 'గుడ్ మార్నింగ్ రాజమండ్రి' కార్యక్రమాన్ని ఎంపీ భరత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆ వార్డు మహిళలు, మత్స్యకారులు, వ్యాపారం చేసుకునే వారు బ్లేడ్ బ్యాచ్, రౌడీ గ్యాంగ్ సమస్యను ఎంపీ భరత్ దష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న త్రీ టౌన్ సిఐ మధుబాబు, ఎస్ఐ శ్యామ్‌సుందర్‌ను ఎంపీ ప్రశ్నించారు. రాత్రి వేళ పోలీసు గస్తీ పెంచాలన, సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని పోలీసులకు సూచించారు. నగరంలో అలజడులకు బాధ్యులైన 66 మందిని పోలీసులు గుర్తించి అరెస్టు చేశారని ఎంపీ భరత్ తెలిపారు. వారంతా సెంట్రల్ జైల్లో ఉన్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక శక్తులను వదిలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు ఇన్చార్జి కస్సే రాజేష్, నగర పార్టీ ఇన్చార్జి అడపా శ్రీహరి, పాలిక శ్రీను, ఎంహెచ్ఒ వినూత్న, ఈఈ కనకారావు, ఎఇ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సాయం అంజేస్తున్న వాసు

టిడిపి కార్యకర్తకు వాసు సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇబ్బందుల్లో ఉన్న టిడిపి కార్యకర్తకు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అండగా నిలిచారు. స్థానిక 1వ డివిజన్‌కు చెందిన దొరబాబుకు ఒక ఒక ప్రమాదంలో చేతికి తీవ్ర గాయమయ్యింది. విషయం తెలుసుకున్న ఆదిరెడ్డి వాసు తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయం అందజేశారు. కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు కష్ట సుఖాల్లో తోడుంటామన్నారు. ఏ సమయంలో ఎటువంటి సహాయం కావాలన్నా పార్టీ సభ్యులమంతా అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ ఖాన్, బుడ్డిగ రవి, చింతపల్లి నాని, ఉప్పులూరి జానకి రామయ్య, మరుకుర్తి రవి యాదవ్, పితాని పైడిరాజు, పుల్లూరి శ్రీను, మామిడి శ్రీను, వింజమూరి సత్యనారాయణ అధిక పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు ప్రభుత్వ చట్టాల గురించి, శిక్షల గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి అన్నారు. స్థానిక నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాలలో ఈ మధ్యాహ్నం 8, 9 తరగతుల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాల లోపు విద్యార్థులు వాహనాలు నడపడం నేరమని, అటువంటి వారిపై పోలీస్ కేసు పెట్టి శిక్ష వేస్తారని చెప్పారు. పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఆర్టికల్ 21, 16 గురించి తెలిపారు. అదేవిధంగా బాలికల కు గుడ్ టచ్, బేడ్ టచ్ గురించి, బాల్య వివాహాల చట్టం గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ప్రత్యూషకుమారి

పెరవలి డివిజన్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి సబ్ స్టేషన్ పరిధిలోని మండల హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. సబ్ స్టేషన్‌లోని మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎస్ పైడిపల గ్రామానికి చెందిన పి.ప్రసాద్ (37) స్వల్ప అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతడు నిద్రపోయే సమయంలో మంచం కింద కుంపటి పెట్టుకున్నాడు. ఆ నిప్పు అంటుకోవడంతో ఇటీవల కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యం పొందుతూ బుధవారం రాత్రి మతి చెందాడు. మతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెదపూడి

అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్యపై వేధింపులకు పాల్పడుతున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు పెదపూడి ఎస్ఐ పి.వాసు గురువారం తెలిపారు. వేండ్ర గ్రామానికి చెందిన వెన్నపు వెంకన్నతో అంజలి అనే యువతికి 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి కొడుకు, కుమార్తె సంతానం. అయితే గత కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన అంజలిపై వెంకన్న దాడికి పాల్పడ్డాడు. ఆమెను వెంటనే కాకినాడ జిజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతోంది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామ శివారున కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం తన సిబ్బందితో దాడి చేసి, కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.2,100 స్వాధీనం చేసుకున్నామన్నారు వీరిని శుక్రవారం కోర్టుకు పంపనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దోపిడీ కేసుల్లో ఆరుగురికి జైలు

ప్రజాశక్తి - ఆలమూరు

రెండు దారి దోపిడి కేసుల్లో ఆరుగురికి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ దీపా దైవకప ఒక్కొక్కరికి రెండున్నరేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. దోపిడీ కేసుల్లో నేరం రుజువు కావడంతో కపిలేశ్వపురం మండలం తాతపూడికి చెందిన కొండే నవీన్‌కుమార్, అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన డేగల సుధీర్‌కుమార్, జంగా బాలాజీ, బూలా శ్రీనులకు, కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన శ్రీమన్నారాయణ, మండలంలోని పెనికేరుకు చెందిన గుడాల వీరవెంకట సత్యనారాయణకు న్యాయమూర్తి శిక్ష విధించారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదనలు పిపి శ్రీరాములు వినిపించారు. కోర్ట్ హెడ్ కానిస్టేబుల్ జి.ప్రభాకర్రావు సహకారం అందించినట్లు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు

కారు ఢీకొని సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-పెరవలి

కారు ఢీకొని సచివాలయ ఉద్యోగి మృతి చెందిన సంఘటన పెరవలిలో గురువారం చోటు చేసుకుంది. రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన చిక్కాల చంద్రకిరణ్ (30) ఖండవల్లి పంచాయతీ సచివాలయం-2లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గురువారం పిట్టలవేమవరం నుంచి పెరవలి వైపు జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలీని వ్యక్తి మరణం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం గంటావారి గూడెం వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మతి చెందినట్లు నల్లజర్ల పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు ఈ సిఐ 9440796614, ఎస్ఐ 9959066999 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ధవళేశ్వరం ఇందిరా కాలనీకి చెందిన ముల్లగిరి బేబీ సరోజినిపై ఆమె పెద్ద కుమారుడు కిషోర్ వెనుక నుంచి కిరోసిన్ చల్లి నిప్పంటించి హత్య చేసిన కేసులో స్పెషల్ జడ్జ్ ఫర్ ఎస్సి అండ్ ఎస్టి కోర్ట్ ఎం.నాగేశ్వరరావు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించిన ఎపిపి వెంకట రత్నం, కోర్ట్ కానిస్టేబుల్స్ రమేష్, ప్రసాద్‌ను అధికారులు అభినందించారు.

చీటింగ్ కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చీటింగ్ కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష,రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఎజెఎఫ్‌సిఎం కోర్టు న్యాయమూర్తి ఎం.ప్రసన్నలక్ష్మి గురువారం తూర్పు చెప్పారు. 2016లో కాకినాడకు చెందిన సయ్యద్ ఇలియాజ్‌కు కిర్లంపూడికి చెందిన దాడి రాజగోపాలకృష్ణ ఎసి వర్క్స్ సబ్ కాంట్రాక్ట్ ఇప్పిస్తానని రూ.44 లక్షల తీసుకుని మోసగించాడు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

స్కూల్ గోడ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ధవలేశ్వరం

ధవళేశ్వరానికి చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ గాలి సుబ్బరాజు జాంపేట లూథరన్ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణం నిమిత్తం తన వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని స్కూల్ హెచ్‌ఎం ఎం.ఐజయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా గాలి సుబ్బరాజు మాట్లాడుతూ దేవాలయం కన్నా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే విద్యాలయం గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ టి.మార్టిన్ సుధాకర్, పూర్వ విద్యార్థి షేక్ చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పడవేసిన చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాలు

ఏలేరు కాలువలో కోళ్ల వ్యర్థాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఏలేరు కాలువలో చనిపోయిన కోళ్ల వ్యర్థాలు గుట్టలుగా పార వేయడంతో మండల పరిధిలోని వడ్లమూరు, జి.రాగంపేట గ్రామాల మధ్య ప్రవహించే ఏలేరు కాలువ దుర్గంధమయమై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల ఫారాల నిర్వాహకులు చనిపోయిన కోళ్లను, కోళ్ల వ్యర్థాలను ఈ కాలువలో పడి వేస్తున్నారని, దీనివల్ల అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందు తున్నారు. రెండు గ్రామాల పంచాయతీల అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

గరగల ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

ఘనంగా నూకాలమ్మ గరగల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పు పాకలు గ్రామంలో నూతనంగా నిర్మించిన నూకాలమ్మ ఆలయం వద్ద గరగల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వైసిపి ఇన్‌చార్జ్ పడాల వీర రాఘవులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో, ప్రజలంతా ఆరోగ్యంతో ఉండాలని ఈ ఏడాది ఏర్పాటుచేసిన ఈ గరగలకు గ్రామంలోని అన్ని వీధుల్లో మహిళలు పూజలు చేశారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

-డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - గండేపల్లి

జిల్లాలో జాబ్ కార్డు కలిగిన వ్యవసాయ కూలీలకు పని కల్పిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి సూచించారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉండటం వలన కూలీలు సక్రమంగా ఉపాధి పనికి రావడంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 17 లక్షల పని దినాలు కనిపించాల్సి ఉందని వాటిని పూర్తి చేసేందుకు రోజుకు లక్ష పని దినాలు కల్పించే విధంగా టార్గెట్ పెట్టుకుని పని చేస్తుంటే కనీసం 40 వేలు పని దినాలు కూడా పూర్తి కావడం లేదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 59 లక్షల 93వేల పనిదినాలు కల్పించడం జరిగిందని ఇందుకుగాను రూ.138 కోట్ల 63 లక్షల వేతనాలుగా చెల్లించామని, మెటీరియల్‌కు గాను రూ.95 కోట్ల 37 లక్షలు ఖర్చు చేశామన్నారు. వేతన రూపేణా ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే దానిలో 40శాతం నిధులు మెటీరియల్ ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీని ద్వారా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకు వీలుంటుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి కూలీలు పనికి వెళ్లి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధికూలీలతోమాట్లాడుతున్న పీడీ వెంకటలక్ష్మి

రమేష్ బాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

అల్లాడ రమేష్ బాబు

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్‌అండ్‌బిఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న అల్లాడ రమేష్ బాబు జెఎన్‌టియుఎ అనంతపురం నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేశారు. కడపకు చెందిన కె.ఎస్.ఆర్.ఎం. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల మేథమెటిక్స్ ప్రొఫెసర్. డాక్టర్ బి.రామ భూపాల్ రెడ్డి నేతత్వంలో రమేష్ బాబు. సమర్పించిన 'ఏ స్టడీ ఆన్ ఫుజి లీనియర్ ప్రోగ్రామింగ్ ఫర్ ఆప్టిమైజేషన్ ప్రొబ్లెమ్స్' పై థీసిస్ సమర్పిం చినందుకు గాను ఈ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్‌చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్. ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి పద్మప్రవీణ్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది, ఎఒ పి.వేణుగోపాల్ అభినందనలు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ డి శ్రీలలిత

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని ఖాళీగా వున్న వికెరాయపురం ఎంపిటిసి - 2 స్థానానికి జరగనున్న ఎన్నిక నిర్వహణలో భాగంగా ఎంపిక చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను గురువారం సామర్లకోట ఎంపిడిఒ డి.శ్రీలలిత పరిశీలించారు. ఇప్పటికే మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. శుక్రవారం ఎన్నికల సంఘం సిఇఒకు పోలింగ్ కేంద్రాల తుది జాబితాను పంపనున్నారు. అందులో భాగంగా గురువారం పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఒ పరిశీలిం చారు. ఎంపిడిఒ వెంట వికెరాయపురం గ్రామ కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

యానాం వార్తలు

సభలో ప్రసంగిస్తున్న గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్.. పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో 2023 - 24 అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి.ఈ సమావేశానికి గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్, స్పీకర్ సెల్వం, ముఖ్యమంత్రి రంగస్వామి, మంత్రులు, ఆయా నియోజకవర్గాల ఎంఎల్ఎలతో పాటు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరయ్యారు. మొట్టమొదటగా గవర్నర్ తమిళిసై ప్రసంగంతో సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్పీకర్ ఎంబలం ఆర్ సెల్వం మాట్లాడుతూ 14 రోజులపాటు ఈ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని, అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు అధికారులు తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా ఆయా శాఖల అధికారులకు సర్క్యులర్ పంపినట్లు స్పీకర్ తెలిపారు.

విచ్చలవిడిగా పందుల సంచారం

ప్రజాశక్తి - యానాం

యానాం ఫరంపేట న్యూ రాజీవ్ నగర్‌లో పందులు విచ్చలవిడిగా తిరుగు తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం తమ గ్రామంలో పంది మతి చెందిందని, మతి చెందిన పందిని తీసేయాలని పందుల పెంపక దారులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని యానాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యానాం పోలీసుల జోక్యంతో పందుల పెంపకం దారులతో దగ్గర వుండి మృతి చెందిన పందిని తొలగించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు న్యూ రాజీవ్ నగర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

19న ప్రపంచ కవితా దినోత్సవ సభ

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని కవి సంధ్య ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో సాహిత్య సభ నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు డాక్టర్ శిఖామణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 19న సాయంత్రం 5 గంటలకు సభ జరగ నుందని తెలిపారు. కవిసంధ్య అధ్యక్షులు, కళారత్న, డాక్టర్ శిఖామణి సభకు అధ్యక్షత వహించనున్నారు. సభలో ప్రముఖ సాహితీవేత్త దర్భశయనం శ్రీనివాసచార్య కవిత్వం ప్రాసంగికత అంశంపై ప్రత్యేక ప్రసంగం చేస్తారని తెలిపారు. కవి సంగమం అధ్యక్షులు ప్రముఖకవి యాకూబ్ ను సభలో ఆత్మీయ కవిసత్కారం చేయనున్నట్టు తెలిపారు. సాహితీవేత్తలు సుధామ, కొప్పర్తిల అధ్యక్షతన కవిసమ్మేళనం జరుగుతుంది.కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె శివారెడ్డి, వాడ్రేవు చిన వీరభద్రుడు, నందిని సిధా రెడ్డి, తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్,ఏనుగు నరసింహారెడ్డి అతిధులుగా పాల్గొంటా రన్నారు. చీకోలు సుందరయ్య,సిఎస్ రాంబాబు లు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తారని శిఖామణి పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షురాలు గాయత్రి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారంలో కార్బొహైడ్రేట్లు, కొవ్వు, ప్రోటీన్లు సమపాలల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవకీదేవి, రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

అరబిందో - కాకినాడ సెజ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మూలపేటలోని అరబిందో ఫార్మా ఫౌండేషన్ వృత్తి విద్యా శిక్షణా కేంద్రం, ప్రతిభ కంప్యూటర్, కెరీర్ గైడెన్స్ సెంటర్లలో మహిళా దినోత్సవం గురువారం నిర్వహించి వివిధ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అడపా లక్ష్మి ప్రకాష్, ఆర్ట్ అఫ్ లివింగ్ శిక్షకులు, టి.హిమ ఐశ్వర్య, ఏ. ఉమా మహేశ్వరీ,ఎం. సత్య ప్రవల్లిక పాల్గొన్నారు. మహిళల కోసం పెన్సిల్, కాయిన్,మ్యూజికల్ చైర్స్ వంటి కొన్ని ఇండోర్ గేమ్‌లు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

వృత్తి శిక్షణా కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న మహిళలు

వికలాంగులను ఆదుకోవటం అందరి బాధ్యత

పెద్దాపురం : వికలాంగ బాలలను ఆదుకుని వారికి సహాయ సహకారాలు అందించటం అందరూ బాధ్యతగా గుర్తించాలని అనంతగిరి సూర్య చక్ర లక్ష్మి అన్నారు. గురువారం పులిమేరు గ్రామంలోని శాంతివర్ధన వికలాంగుల గురుకుల పాఠశాలలో అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె బాలలకు మహిళలకు పండ్లు, స్వీట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు,ప్రిన్సిపాల్ ఆర్ సత్యవేణి,పాఠశాల ఏవో వేణు,ఆర్ శాంతి వర్ధన్, చంటిబాబు అప్పలరాజు, బాబి, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ బాలలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న సూర్యచక్రలక్ష్మి

బాలుని వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం గ్రామానికి చెందిన చిన్నారి అక్షయ్‌రామ్ చెన్నై ఆసుపత్రిలో వైద్యం పొందుతుండడంతో వైద్యం నిమిత్తం గోకవరం గ్రామానికి చెందిన పలువురు సంతలు జరిగే ప్రాంతాలకు వెళ్లిరూ.23,400 విరాళాలు వసూలు చేశారు. గురువారం స్థానిక వైద్యులు పాలూరి బోసు బాబుకు ఈ మొత్తాన్ని అందజేశారు. వైద్యుడు బోసుబాబు మాట్లాడుతూ బాలుని వైద్యానికి సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

షాట్ పుట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జిల్లా క్రీడా మైదానంలో పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై ఎటి కల్చరల్ (క్రీడా) శాఖ ఆదేశాలను అనుసరించి కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో క్రీడాకారుణులకు 100 మీ.లు, 400 మీ.ల పరుగు పందెం, షాట్ పుట్, లాంగ్ జంప్ పోటీలు రెండో రోజు కూడా సాగాయి. రెండవ రోజు జరిగిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 66 మంది మహిళలు పాల్గొన్నారని క్రీడా శిక్షకులు శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

మండల కేంద్రాల్లో మహిళా మార్ట్‌లు

ప్రజాశక్తి -తాళ్లపూడి

స్వయం సహాయక గ్రూపులు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా ఆయా గ్రూపుల భాగస్వామ్యంతో ప్రతి మండల కేంద్రంలో మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డిఆర్‌డిఎ పీడీ ఎస్.సుభాషిణి అన్నారు. చేయూత పథకం కింద ప్రభుత్వం అందించిన యూనిట్లను పరిశీలించేందుకు గురువారం పీడీ తాళ్లపూడి మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సుభాషిణి మాట్లాడుతూ గృహిణిలు ప్రతిరోజూ కొనుగోలు చేసుకునే నిత్యవసర వస్తువులు మహిళా మార్ట్ ద్వారా కొనుగోలు చేస్తే సుమారు రూ.కోటి టర్నోవర్ చేయవచ్చని దీని ద్వారా వచ్చే రెండు శాతం ఆదాయాన్ని స్థానిక సంఘాలకు జమ చేస్తారని సూచించారు. తాళ్లపూడి ఐకెపి ఎపిఎం రోజ్ మాణిక్యం ఆధ్వర్యంలో ఉద్యోగులు సిబ్బంది పీడిని విడివిడిగా సత్కరించారు. పిడి వెంట డిపిఎం రాజబాబు ఉన్నారు.

మహిళలతో సమావేశమైన పీడీ

వృద్ధాశ్రమంలో దాతల అన్నదానం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో జై కిసాన్ వృద్ధుల ఆశ్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉప్పలపాటి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం గురువారం వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పళ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో అన్ని వద్ధాశ్రమాలకు మానవత సంస్థ సహాయ సహకారాలు అందజేస్తున్నామని, మానవత సంస్థ సభ్యులు, బంధువులు, మిత్రులు జన్మదిన ఇతర వేడుకలను వద్ధాశ్రమంలో నిర్వహించుకుంటూ వారితో సంతోషంగా గడుపుతున్నామన్నారు. వద్ధాశ్రమం నిర్వాహకుడు డి.భీమరాజు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న అభినందనలు తెలియజేస్తూ సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి ఫర్నిచర్ అందజేత

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని గౌరీపట్నం పిహెచ్‌సికి గురువారం త్రివేణి గ్లాస్ పరిశ్రమ ఆధ్వర్యంలో 10 ఫ్యాన్లు 25 కుర్చీలను ఫ్యాక్టరీ ఎండి కనాల్ గుప్తా ఆరోగ్య కేంద్రం వైద్యురాలు టి.సూర్యకళకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు సూర్య కళ మాట్లాడుతూ ఫ్యాక్టరీ వారు అందించిన కుర్చీలు కేంద్రానికి వచ్చే గర్భిణులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా దాతలకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం కులకర్ణి త్రినాథ్ కుమార్, మేనేజర్ ప్రసన్న, పిఒ మధుసూదన్ రావు, డాక్టర్ సుజనా, సిహెచ్‌ఒ కృష్ణుడు. ఫార్మసిస్ట్ బి.సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో దాసరి వారి వీధిలో రూ.3 లక్షల పంచాయతీ నిధులతో గురువారం సత్యసాయి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి నాయకులు సుంకర వీరబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతిత్వరలోనే ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని, ఎవరికీ ఎటువంటి తాగునీటి సమస్యలూ ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి, ఉనుకూరు యేసు రత్నం, బత్తుల నానాజీ, పసుమర్తి బుజ్జి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

'మానవత'కు కోస్టల్ బ్యాంకు విరాళం

దేవరపల్లి : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సమావేశం బండి సూర్యప్రకాశరావు అధ్యక్షతన గురువారం కేసు రోజు సీతారామయ్య ఇంటి వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోస్టల్ బ్యాంకు మేనేజర్ కేత శ్రీనివాస్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీజర్ బాక్సులు శాంతిరథం భద్రపరుచుటకు షెడ్డు నిర్మాణానికి కోస్టల్ బ్యాంకు రూ.2 లక్షలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఈడుపుగంటి నాగేశ్వరరావు, కె.రాజ్ కుమార్, సూరిచక్రం, సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ

గోకవరం : రంపయర్రంపాలెంలో వరి పొలాల్లో బయో కల్చర్ ఎరువులు, పురుగు ముందు డ్రోన్ సాయంతో గురువారం పిచికారీ చేశారు. సుమారు 40 ఎకరాల్లో పురుగు మందులు డ్రోన్ సహాయంతో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ డ్రోన్ సుమారు 25 కేజీలు బరువు ఉంటుందని 8 నుండి 10 నిమిషాల్లో ఎకరం పొలం పిచికారీ చేసిందని చెప్పారు. రైతులకు సమయం వృథా కాకుండా లోపల ఉన్న పొలాల్లో కూడా పిచికారీకి అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎం.మహబూబ్ వల్లీ, టి.శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నల్లజర్ల : ఘంటావారిగూడెం అంబేద్కర్ కాలనీలో పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడి తర్వాత బడి గంటలు కార్యక్రమంలో బుధవారం పరీక్షల సామగ్రినిపంపిణీ చేశారు. రీడ్ కోఆర్డినేటర్, ఎర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, చర్చి సంఘ కాపరి పాస్టర్ దుద్దే అనిల్ కుమార్, సహకారంతో 50 మంది విద్యార్థులకు పెన్నులు, ఎగ్జామ్ పాడ్స్, స్కేల్స్, పెన్సిల్స్, పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగపండు, సుహాసిని పాల్గొన్నారు.

దగ్ధమైన తోట పరిశీలన

తాళ్లపూడి : నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తి చేసి తమకు పరిహారాన్ని అందజేయాలని పలువురు పేద మహిళ రైతులు అధికారులను కోరారు. మండల పరిధిలోని బయ్యవరం రెవెన్యూ పరిధిలో కొండపై ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో జీడి మామిడి పంట పూర్తిగా కాలిపోయిన ప్రదేశాన్ని గురువారం ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. తమను ఆదుకోవాలని ఈ పంట పొలాలకు చెందిన రైతులు ఇటీవల హోమ్ శాఖామంత్రి తానేటి వనితను కలిశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టం వివరాలకు చర్యలు చేపట్టినట్టు ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ వెంట విఆర్‌ఒలు లీలా ప్రవీణ్, సచివాలయ వ్యవసాయ సిబ్బంది ఈశ్వర్ భార్గవ, సాయి తదితరులున్నారు.

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 99/2022

Between:
Vanamadi China Gangadhara Rao and others ...*Petitioners*
AND
M.Satish and Others ...*Respondents*

Notice to Respondent:
R-2: Moora Avinash, S/o. Venkateswara Rao, age not known, D.No. 1/254, Patharlagadda, Karapa Village, Karapa Mandal, E.G.Dt., Pin: 533462 (Owner of Tractor bearing Regd. No. AP 39 UA 6049)
In the above M.V.O.P. No. 99/2022 the 2nd Respondent hearing date stand posted **to 31-03-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.
Hearing date: 31-03-2023
N.RAJASEKHAR, Advocate
Amalapuram Amalapuram, E.G.Dist.,
Dt.01-03-2023 Cell: 9849193665

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 238/2020
ఓ.ఎస్.నెం. 139/2017

బిట్వీన్:
పోసిన వెంకట భాస్కరరావు మరియు అనదర్ ...పిటీషనర్లు /వాది
మరియు
తాటికొండ నాగరత్నం మరియు అదర్స్ ...రెస్పాండెంట్లు/ వాదులు
టు: ప్రపోజ్డ్ పార్టీస్ /రెస్పాండెంట్లు:
32) తాటికొండ నాగ సరస్వతి, భర్త: (లేటు) నాగేశ్వరరావు, వయసు 53 సంIIలు, డో.నెం. 5-2-7/సి, విద్యనగర్, సీతయ్యగారి తోట, పిఠాపురం.
33) తాటికొండ సురేష్ కుమార్, తండ్రి: (లేటు) నాగేశ్వరరావు, వయసు 28 సంIIలు, డో.నెం. 5-2-7/సి, విద్యనగర్, సీతయ్యగారి తోట, పిఠాపురం.
పై నెంబరు పిటీషను నందు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు కాలయాపన చేయు దురుద్దేశ్యముతో పిటీషను నోటీసులు మరియు పోస్టల్ ఆర్.పి.లను తీసుకొనకుండా తిప్పి పంపించుచున్నారు. కావున సదరు పిటీషను విచారణ నిమిత్తం **ది.27-03-2023వ తేదీ ఉదయం గం।।10:30 ని।।లకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను.** లేని ఎడల మీపై పరోక్షంగా పిటీషను తీర్మానించెదరు అని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.సత్యనారాయణ
జి.వినయ్ తేజ, అడ్వకేట్స్, పెద్దాపురం.
సెల్: 98482 30996, 95732 63333